వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
సోమవారం, జులై 20, 2026




# వైఆర్‌పీ ఫౌండేషన్ చేయూత

- 187 మందికి రూ.74 లక్షల స్కాలర్‌షిప్‌లు
- 680 మందికి పైగా విద్యార్థులకు విద్యా సహాయం అందించిన సంస్థ
- ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ హెచ్ ఆర్సీ చైర్మన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రతిభ కలిగిన ఏ ఒక్క విద్యార్థీ ఆర్థిక పరిస్థితుల వల్ల చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో వైఆర్‌పీ ఫౌండేషన్ మరొకసారి తన సేవా నిరతిని చాటుకుంది. వైష్ణోయి గ్రూప్, వైఆర్‌పీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు చైర్మన్ శ్రీ యెలిశాల రవిప్రసాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో వార్షిక స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 2026–27 విద్యాసంవత్సరానికి గానూ మొత్తం 187 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.74 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డా.జె. పూర్ణచంద్రరావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.జగదీశ్వర్ పాల్గొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం వైఆర్‌పీ ఫౌండేషన్ విద్యా రంగంలో అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. హైదరాబాద్, నల్గొండతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన పాఠశాల, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ విద్యార్థులకు ఈ ఆర్థిక సాయం లభించింది."విద్య ఒక్కరి జీవితాన్ని మాత్రమే కాకుండా, ఇటు కుటుంబాన్ని, అటు సమాజాన్ని మార్చే శక్తిని ఇస్తుంది. నేడు ఫౌండేషన్ నుంచి సాయం పొందిన విద్యార్థులు, భవిష్యత్తులో స్థిరపడి మరొకరికి అండగా నిలవడమే నిజమైన సామాజిక సేవ." అని వైఆర్‌పీ ఫౌండేషన్ చైర్మన్ యెలిశాల రవిప్రసాద్ అభిప్రాయపడ్డారు.

## వందలాది కుటుంబాల్లో కాంతులు..

2022లో ప్రారంభమైన ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 680 మందికి పైగా విద్యార్థులు లబ్ధి పొందారు. ఇక్కడ లభించిన తోడ్పాటుతో ఎందరో డాక్టర్లు, ఇంజినీర్లు, అధికారులు, సీఏలు, సాఫ్ట్‌వేర్ నిపుణులుగా స్థిరపడి, తమ కుటుంబాల్లో తొలి గ్రాడ్యుయేట్లుగా నిలిచారు.

## సమాజ సేవలో ముందంజ..

కేవలం విద్యారంగమే కాకుండా ఫౌండేషన్ పలు విభాగాల్లో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పర్యావరణం: ఇప్పటివరకు హైదరాబాద్, నల్గొండ ప్రాంతాల్లో 1 లక్షకు పైగా ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ. సాంస్కృతికం: పుష్కరిణుల నిర్మాణం, పునరుద్ధరణ మరియు ఆలయాల అభివృద్ధి. సంక్షేమం: అనాథ, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ మానసిక ఆరోగ్య కేంద్రాలకు మౌలిక వసతులు, నిత్యావసరాలు, శీతాకాలంలో దుప్పట్లు, పేదలకు ఆహార పంపిణీ. వ్యాపారంలో సాధించిన విజయాన్ని సమాజాభివృద్ధికి వెచ్చించాలనే సంకల్పంతోనే ఈ సేవలు అందిస్తున్నామని, భవిష్యత్తులో ఈ కార్యకలాపాలను మరింత విస్తరిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.




# "హెచ్ఐవి లేని హైదరాబాద్" లక్ష్యంగా కార్యక్రమాలు

- డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్లా శ్రీనివాస్
- '95-95-95' టార్గెట్ సాధనకు ఫీల్డ్ సిబ్బందికి మైక్రోప్లాన్
- గర్భిణులందరికీ తప్పనిసరిగా హెచ్ఐవి స్క్రీనింగ్ పరీక్షలు
- ఆరోగ్యశాఖ అధికారులతో డీఎంహెచ్ఓ ఉన్నత స్థాయి సమీక్ష



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్ జిల్లాను "హెచ్ఐవి రహిత జిల్లా"గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వైద్యాధికారులు, ఫీల్డ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిడాక్టర్ పుట్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ జిల్లాలో హెచ్ఐవి నియంత్రణ, నివారణ కార్యక్రమాలపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి ఐసిటిసి సెంటర్, యుపిహెచ్‌సీ, బస్తీ దవాఖానాలలో హెచ్ఐవి ఉచిత టెస్టింగ్, స్క్రీనింగ్ పరీక్షలు నిరంతరాయంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. జాతీయ లక్ష్యమైన 95-95-95ను ఈ నెలలోనే పూర్తి చేయాలని అధికారులకు డాక్టర్ పుట్లా శ్రీనివాస్ ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. హెచ్ఐవి బాధితుల్లో 95% మందిని త్వరగా గుర్తించడం. గుర్తించిన వారిలో 95% మందికి ఏఆర్‌టీ చికిత్స ప్రారంభించడం. చికిత్స పొందుతున్న వారిలో 95% మందికి వైరల్ లోడ్ తగ్గించడం. ఈ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, మైక్రోప్లాన్ ప్రకారం క్షేత్రస్థాయిలో ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాలో ఉన్న ప్రతి గర్భిణికి తప్పనిసరిగా హెచ్ఐవి స్క్రీనింగ్ చేయాలని డిఎంహెచ్ఓ స్పష్టం చేశారు. గర్భధారణ సమయంలోనే పరీక్షించి, పాజిటివ్ వచ్చిన తల్లులకు వెంటనే పీఎంటీసీటీ సేవలు అందించడం ద్వారా నవజాత శిశువులకు హెచ్ఐవి సంక్రమించకుండా అరికట్టే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. "భవిష్యత్తులో మన హైదరాబాద్ జిల్లాలో 'హెచ్ఐవి' అనే మాట వినిపించకూడదు" అని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సరస్వతి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీధర్, వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ శ్రీకల, మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

